పత్రికా ప్రకటన - 1

# ముఖ్యమంత్రి కార్యాలయము

# తెలంగాణ ప్రభుత్వం

తేదిః 19.07.2014

తెలంగాణలో పారిశ్రామిక, వైద్య రంగంలో సేవలు అందించేందుకు బిర్లా కంపెనీ ముందుకు వచ్చింది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అవలంభించబోతున్న పారిశ్రామిక విధానం దేశంలోనే అత్యంత ప్రభావవంతంగా ఉంటుందని బిర్లా కంపెని అభిప్రాయపడింది. సచివాలయంలో ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావును బిర్లా కంపెని సి.కె.బిర్లా, కంపెని మేనేజింగ్ డైరెక్టర్ దీపక్ క్షేత్ర కలుసుకున్నారు. హైదరాబాద్‌తో తమకు వున్న అనుబంధాన్ని పంచుకున్నారు. తెలంగాణలో సిమెంట్ ఫ్యాక్టరీలను విస్తరించే ఆలోచన వున్నదని, అలాగే వైద్య రంగంలో కూడా పెద్ద ఎత్తున పెట్టుబడులు పెట్టాలని ఆలోచిస్తున్నట్లు ముఖ్యమంత్రి చెప్పారు. వైద్య విద్య రంగంలో సేవలను విస్తరించాలనుకున్నట్లు కూడా వివరించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సహకారాన్ని కోరారు. దీనికి కేసిఆర్ సానుకూలంగా స్పందించారు. తెలంగాణ ప్రభుత్వం ఇండస్ట్రీ ఫ్రెండ్లీ పాలసీ తీసుకువస్తున్నామన్నారు. తెలంగాణలో పరిశ్రమల కోసం అనుకూలంగా వున్న దాదాపు రెండున్నర లక్షల ఎకరాల భూమిని టిఎస్ఐఐసి ఇస్తామని పూర్తిగా అన్ని అనుమతులు ప్రభుత్వం చొరవ తీసుకొని మంజూరు చేస్తుందని చెప్పారు. ఇందుకోసం దేశంలోనే అత్యుత్తమైన సింగిల్ విండో విధానాన్ని ప్రవేశ పెడతామని, ముఖ్యమంత్రి కార్యాలయంలో ప్రత్యేక చేజింగ్ సెల్ ఏర్పాటు చేస్తామని రెండు మూడు వారాల్లోనే అనుమతులు ఇస్తామని చెప్పారు. చైనా మాదిరిగా ఇండస్ట్రీయల్ పార్క్‌ను డెవలప్ చేస్తామన్నారు. అవినీతి రహితమైన విధానాన్ని అవలంభిస్తామని, పారిశ్రామిక అనుమతుల విషయంలో క్షేత్ర స్థాయిలో అనవసర ఇబ్బందులు రాకుండా చూసేందుకు సరళమైన విధానాన్ని ప్రవేశపెడుతున్నామని, ఇందుకోసం చట్టం కూడా తెస్తామని చెప్పారు. కేసిఆర్ ప్రతిపాదించిన పారిశ్రామిక విధానం పట్ల బిర్లా అమితాసక్తిని ప్రదర్శించారు. దేశ వ్యాప్తంగా వున్న పారిశ్రామిక వేత్తలు తెలంగాణ వైపు చూస్తున్నారని కూడా చెప్పారు.

ఈ సమావేశంలో ప్రధాన కార్యదర్శి రాజీవ్ శర్మ, ముఖ్యమంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీ నర్సింగ్ రావు, ఇండస్ట్రీయల్ సెక్రటరీ ప్రదీప్‌చంద్ర, ముఖ్యమంత్రి అదనపు కార్యదర్శి స్మితా సబర్వాల్ పాల్గొన్నారు.

---

సిపిఆర్ఓ టు సిఎం.